అనుదినం జనస్వరం

www.navatelangana.com

# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

1

మంగళవారం 21 ఫిబ్రవరి 2023


## రేషన్ షాపు ఏర్పాటు చేయాలని వినతి

నవతెలంగాణ- మంచిర్యాల

మున్సిపాలిటీ 24వ వార్డులో ప్రభుత్వ చౌక ధరల దుకాణం ఏర్పాటు చేయాలని అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్‌ను వార్డు కౌన్సిలర్, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వేములపల్లి సంజీవ్ కోరారు. సోమవారం అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 2437 ఓటర్లు, 3000కు పైగా జనాభా కలిగి ఉన్న 24వ వార్డులో రేషన్ షాప్ లేకపోవడంతో వార్డువాసులు ఇబ్బందులెదుర్కొంటున్నారని తెలిపారు. సుమారు 500కు పైగా రేషన్ కార్డులు కలిగి ఉన్న లబ్దిదారులు పక్కవార్డులోని ఇస్లాంపురకు, సంజీవయ్య కాలనీకి వెళ్లి బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోందని తెలిపారు. వినతిపత్ర అందజేసిన ప్రతినిధి బృందంలో పడాల లింగారెడ్డి, నెల్లి గోపాల్ ఉన్నారు.



## మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడికి పరామర్శ

**ఆసిఫాబాద్ :** మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నగేషే శంకర్ ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదం జరిగి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సంఘం తరపున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు రూప్నర్ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బాలేశ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి పటేల్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు సాయికృష్ణ పాల్గొన్నారు.



## కట్ చేసిన సెక్యూరిటీ గార్డుల డబ్బులు తిరిగి ఇవ్వాలి



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే జీతాల నుండి వృత్తి పన్ను పేరుతో కట్ చేసిన డబ్బులు వెంటనే తిరిగి ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఓదెలు డిమాండ్ చేశారు. సోమవారం జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయమై సాయికోర్ సంస్థ కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రావును అడిగితే ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే వృత్తి పన్ను కట్ చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాలుంటే చూపించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో ఎక్కడా లేని ఒక్క బెల్లంపల్లి ఏరియాలోని సెక్యూరిటీ గార్డుల జీతాల నుండే వృత్తి పన్ను కట్ చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయా? అని ఓదెలు ప్రశ్నించారు. అసలే జీతాలు పెరగక, మరో పక్క నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతుండగా పన్ను పేరుతో అదనపు భారం వేయడం సమంజసం కాదన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికులకు లేని వృత్తి పన్ను కాంట్రాక్టు కార్మికులకు విధించడం అన్యాయమని, వెంటనే ఉపసంహరించుకొని కట్ చేసిన డబ్బులు తిరిగి ఇవ్వాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున్న ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## బీఆర్‌ఎస్‌లో భారీ చేరికలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

పట్టణంలోని చిల్కూరి లక్ష్మినగర్‌లో సోమవారం పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే జోగు రామన్న వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే సైతం ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ బైక్ ర్యాలీలో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాలనీకి చెందిన యువకులు, మహిళలు బిజెపి, కాంగ్రెస్ పార్టీలను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న అనేక సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తున్నామన్నారు. రానున్న వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా మిషన్ భగీరథ పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. రూ.50లక్షలతో రహదారి నిర్మాణ పనులు సైతం ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. పట్టణంలోని ఇరవై వార్డుల్లో బుద్ధ విహార్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్న నేపథ్యంలో వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ఒక్కరు చదువుకునేలా విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్ సంద నర్సింగ్, నాయకులు జావిద్, నసీర్ ఖాన్, ధమ్మపాల్, మిషు, గోలి శంకర్, ఎజాజ్, జవ్వూర్, బొడగం మమత, కస్తాల ప్రేమల, దాసరి రమేష్ పాల్గొన్నారు.

## ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



నవతెలంగాణ - రెబ్బెన

ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవరావు అన్నారు. మన ఊరు మన బడిలో భాగంగా మండలంలోని పుంజుమేరగూడ గ్రామంలో రూ.17.24 లక్షల వ్యయంతో, గంగాపూర్‌లో రూ.20.44 లక్షల వ్యయంతో పనులు చేపట్టిన ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమం మొదటి విడతలో భాగంగా జిల్లాలో 251 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. పాఠశాలలో బేంచీలు, వంట గది, భోజన గది, ప్రహరిగోడ, అదనపు గదులు, తాగునీరు, విద్యుత్ సరఫరా ఇతర అన్ని వసతులు కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని విద్యరంగం అభివృద్ధి కోసం సమూల మార్పులలో భాగంగా చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా విద్యార్థులకు వసతులతో కూడిన నాణ్యమైన విద్యనందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య ప్రమాణాలతో విద్యాబోధన జరుగుతోందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి పాల్గొన్నారు.

## అధికారులతో ప్రజావాణి కళకళ

**ఆసిఫాబాద్ :** కరోనా విజృంభన నేపథ్యంలో రాహుల్ రాజ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటినుండి అధికారులందరితో కూడిన ప్రజావాణి కాకుండా తన ఛాంబర్‌లో తానొక్కడే అర్జీదారుల వద్ద నుండి అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. తాజాగా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బోర్కడే హేమంత్ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులను సమావేశ మందిరానికి రప్పించుకొని వారి ఆధ్వర్యంలో అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించడంతో మూడు సంవత్సరాల తర్వాత ప్రజావాణి అధికారులతో కళకళలాడింది. ఈ సందర్భంగా ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని, అప్పుడే అధికారులకు గుర్తింపు వస్తుందన్నారు. శాఖల వారిగా ఎప్పటికప్పుడు ప్రజావాణి అర్జీలపై సమీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పేయి, ఆర్డీవో రాజేశ్వర్, జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బండెనక బండి కట్టి..పోరు బాట పట్టి..!

- భూ పరిహారం కోసం కదం తొక్కిన రైతులు
- ఎడ్లబండ్లపై పిప్పల్‌కోటి నుంచి కలెక్టరేట్‌కు రాక
- మద్దతు తెలిపిన సీపీఎం(ఎం), కాంగ్రెస్, బీజేపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పిప్పల్‌కోటి రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న రైతులు పరిహారం పెంచాలని వినూత్న నిరసన చేపట్టారు. వారం రోజులుగా రిజర్వాయర్ పనుల వద్దనే నిరసన దీక్ష చేపట్టిన ముంపు రైతులు తాజాగా సోమవారం పిప్పల్‌కోటి గ్రామం నుంచి ఎడ్లబండ్లు కట్టుకొని కలెక్టరేట్‌కు వచ్చి నిరసన తెలిపారు. గ్రామం నుంచి కప్పర్ల, బండల్ నాగాపూర్ నుంచి జిల్లా కేంద్రం వరకు ర్యాలీగా వచ్చారు. వీరికి సీపీఐ(ఎం), కాంగ్రెస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఎడ్లబండ్లు ఎక్కువగా రావడంతో ట్రాఫిక్ సమస్యలు వస్తాయని ముందుగానే పసిగట్టిన పోలీసులు వాటిని స్పిన్నింగ్ మిల్లు వద్దనే నిలిపివేశారు. కొన్నింటిని మాత్రమే లోనికి రానిచ్చారు. కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, నాయకులకు మధ్య స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం కొందరిని అనుమతించడంతో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ పిప్పల్‌కోటి జలాశయ నిర్మాణం కోసం ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణ అక్కడి రైతుల పొట్ట కొడుతోందని మండిపడ్డారు. ఎద్దు ఏడ్చిన ఏవుసం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని ఉదహరిస్తూ రైతుల ఉసురు పోసుకోవద్దని హితవు పలికారు. పరిహారం తగ్గింపు విషయంలో రాజీపడేది లేదని తెగేసి చెప్పారు. అప్పటి ధరలు ఇప్పటి ధరలతో సమానం కాదని పెరిగిన ధరల రీత్యా ఎకరానికి రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నాటి ఒప్పంద ప్రకారం ఎకరానికి రూ.8లక్షలు చెల్లించినా భూములు విక్రయించేదిలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి రైతులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని పరిష్కారమైన చట్టాలను తీసుకొచ్చిందని గుర్తుచేశారు. 2014 తర్వాత బీజేపీ ప్రభుత్వం భూసేకరణ చట్టాలకు తూట్లు పొడుస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణం కోసం భూసేకరణ చేపట్టడం నాలుగేళ్ల కిందట చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం కాకుండా పరిహారం మరింత తక్కువ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వారం రోజులుగా రిజర్వాయర్ స్థలంలోనే ధర్నా చేపట్టినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బండారు దత్తాత్రి, బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పూసం సచిన్, పిప్పల్‌కోటి భూ నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.






# ఐటీడీఏ ముట్టడి ఉద్రిక్తం..!

- సీఎం ప్రకటనపై ఆదివాసుల్లో ఆగ్రహం
- మూడు గంటల పాటు కార్యాలయం ఎదుట ధర్నా
- లోనికి చొచ్చుకెళ్లేందుకు యత్నం..అడ్డుకున్న పోలీసులు
- కార్యాలయం..అధికారుల వాహనాల అద్దాలు ధ్వంసం

నవతెలంగాణ - ఉట్నూర్

సీఎం కేసీఆర్ 11 కులాలను ఎస్టీ జాబితాలోకి చేరుస్తామని అసెంబ్లీలో ప్రకటన చేయడం, చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఐటీడీఏ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసీ గిరిజనులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి తరలివచ్చి ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఎదుట బైటాయించి ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్సా పోచయ్య, జిల్లా అధ్యక్షుడు గేడం గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావు, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ పుష్పారాణి తదితరులు పాల్గొన్నారు. ధర్నా చేపడుతున్న క్రమంలో ఆదివాసీలు, నాయకులు ఒక్కసారిగా కార్యాలయంలోనికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు అదుపు చేసినప్పటికీ ఆదివాసీలు ఆగ్రహంతో బారికేడ్లు కిందపడేసి కార్యాలయంలోనికి వెళ్లారు. అక్కడ ఐటీడీఏ ఏపీఓ జనరల్ భీంరావు, ఏటీడబ్ల్యూఏసీ చైర్మెన్ కనక లక్కేరావు వాహనాలతో పాటు కార్యాలయ అద్దాలను ధ్వంసం చేశారు. నాయకులను పోలీసులు అదుపు చేసి బయటకు తీసుకొచ్చారు. దీంతో ఉట్నూర్, మంచిర్యాల రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏపీఓ జనరల్ భీంరావు, ఆర్డీఓ సురేష్, పీవీటీజీ ఏపీఓ భాస్కర్ నాయకులతో మాట్లాడి సముదాయించినప్పటికీ వారు వినకుండా ఆందోళన కొనసాగించి మళ్లీ కార్యాలయం లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇద్దరు ఆదివాసీ గిరిజనులపై లాఠీ దెబ్బలు పడ్డాయని, ఇక్కడికి ఐటీడీఏ పీఓ రావాలని ధర్నా కొనసాగించారు. పరిస్థితి విషమంగా మరకముందే ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డికి సమాచారం అందించారు. వెంటనే ఎస్పీ సంఘటన స్థలానికి చేరుకుని ఆదివాసీ నాయకులతో చర్చించారు. పీఓ రావాలని నాయకులు పట్టుబట్టడంతో పీఓ వరుణ్‌రెడ్డి సంఘటన స్థలానికి వచ్చి ఆదివాసీలతో మాట్లాడారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



**ఆ తీర్మానాన్ని రద్దు చేయాలి**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 11 కులాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేసి, చట్టబద్ధతలేని లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని ఆదివాసీ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. గిరిజనులు విద్యాభివృద్ధి కోసం గిరిజన యూనివర్సిటీని ఆదిలాబాద్ జిల్లాలోనే ఏర్పాటుచేయాలని, ఆదివాసులు సాగు చేస్తున్న అటవీ భూములకు ఎలాంటి తీర్మాణాలు, షరతులు లేకుండా హక్కుపత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో పెసా, 1/70 చట్టాలను పకడ్బందీగా అమలు చేసి, జీఓ నెం.3ను యధావిధిగా అమలు చేయాలని, 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆయా ప్రభుత్వ 29 శాఖలలో ఉన్న జీవోలను చట్టం చేసి ఆదివాసీ తెగల యువతీ, యువకుల చేతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. ప్రత్యేక డీఎస్సి ద్వారా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని, దళిత బంధ మాదిరిగానే ఆదివాసులకు ఆదివాసీ బంధు ఇవ్వాలని, జిల్లా కేంద్రాలలో, మండల కేంద్రాలలో నివసిస్తున్న ఆదివాసులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీ భూములు కోల్పోయిన ఆదివాసీలకు సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగాలు కల్పించాలని పేర్కొన్నారు.

**భారీగా పోలీసుల బందోబస్తు**

తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఐటీడీఏ ముట్టడి నేపథ్యంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ముందు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఉంచారు. ముట్టడి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న సందర్భంగా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు అక్కడి చేరుకున్నారు. సుమారు 150 పోలీసులు బందోబస్తు చేపట్టినట్లు సమాచారం. పీఓ హామీతో ఆందోళన సద్దుమనగడంతో పోలీసులు ఊపిరి పిర్చుకున్నారు. ఈ ముట్టడిలో తుడుందెబ్బ, అనువాసి అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.





## ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తాం : ఎంపీ సోయం బాపురావు

నవతెలంగాణ-బోథ్

ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తామని ఎంపీ సోయం బాపురావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి నల్ల గంగయ్య ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాగోస-బిజెపి భరోసా కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు దోచుకుంటున్న తీరుపై మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజు యాదవ్, రైల్వే బోర్డు సభ్యుడు జీవీ రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, మండల కన్వీనర్ సుభాష్ సూర్య, సోషల్ మీడియా కన్వీనర్ బోరే రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాసం..?

- క్యాంపు రాజకీయాలకు తెరతీసిన సొంత పార్టీ నాయకులు
- మండల బీఆర్‌ఎస్‌లో బయటపడ్డ అంతర్గత విభేదాలు

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని నెల్కివెంకటాపూర్ సహకార సంఘం చైర్మన్ కాసనగొట్టు లింగన్నపై సొంత పార్టీ సభ్యులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. 2020లో సహకార సంఘం చైర్మన్ ఎన్నికలు జరిగినప్పుడు బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు సభ్యులు చైర్మన్ పదవీ తమకే కావాలని పట్టుబట్టారు. వారికి ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు నచ్చజెప్పి కాసనగొట్టు లింగన్నకు చైర్మన్ పదవి కట్టబెట్టారు. అప్పటి నుండి చైర్మన్ పదవీపై కన్నేసిన సభ్యులు వ్యతిరేకంగా ఏర్పడి ఎలాగైనా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి చైర్మన్ పదవీ పొందాలని ఆశించారు. ఇదే క్రమంలో సోమవారం 8 మంది సహకార సంఘం సభ్యులను ఒకటిగా చేసి క్యాంపు రాజకీయాలకు తెర తీశారు. చైర్మన్ పదవి ఇస్తేనే తిరిగి వస్తామని, లేకుంటే పార్టీ మారుతామని స్థానిక నాయకులకు సమాచారం ఇచ్చినట్లు విశ్వసనీ వర్గాల సమాచారం. దీంతో పార్టీలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయని పలువురు చర్చించుకుంటున్నారు. దీనిపై డీసీఓ క్రిష్ణను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారమూ లేదని తెలిపారు.

'నవతెలంగాణ' కథనానికి స్పందన

## నీటి సరఫరాకు కదిలిన యంత్రాంగం..!

- గోవింద్‌పూర్ సంపునకు మరమ్మతులు



నవతెలంగాణ- నేరడిగొండ

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో నిలిచిపోయిన మిషన్ భగీరథ నీటి సరఫరా పునరుద్ధరించేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. నేరడిగొండ మండలం గోవింద్‌పూర్ వద్ద ఏర్పాటుచేసిన భగీరథ సంపునకు మరమ్మతులు చేపడుతున్నారు. ఈ నెల 13వ తేదీన నవతెలంగాణ ప్రధాన పత్రికలో 'భగీరథ ఎన్నాండ్లీ వృథా' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా స్థాయి అధికారులు గోవింద్‌పూర్ వద్ద నిర్మించిన సంపు మరమ్మతులకు గురికావడంతో సోమవారం సిబ్బందితో బాగు చేయించారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ట్యాంకులను నీటితో నింపడంతో మంగళవారం నుంచి పీచర, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఇంటింటికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. దీంతో వేసవిలో నీటి ఎద్దడికి దూరమయ్యే అవకాశం ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## డ్వాక్రా మహిళలను పట్టించుకోని ప్రభుత్వం




నవతెలంగాణ-నిర్మల్

డ్వాక్రా మహిళల ఓట్లు తప్ప వారి సమస్యలు కేసీఆర్ ప్రభుత్వానికి పట్టడం లేదని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల లక్ష్మీ అన్నారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, అభయ హస్తం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీలమహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం గాంధీ పార్క్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. డ్వాక్రా మహిళల ఓట్లు తప్ప వారి సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. డ్వాక్రా మహిళలు తమ కష్టార్జితంతో వేల కోట్ల రూపాయలు పొదుపు చేసి బ్యాంకులో జమ చేసి రుణాలు పొందుతున్నారన్నారు. ప్రతి నెల 12 శాతం వడ్డీ చెల్లిస్తున్నారన్నారు. ప్రభుత్వం మాత్రం తిరిగి వడ్డీ డబ్బులు ఇవ్వకుండా నిర్లక్ష్య వైఖరి చూపిస్తుందన్నారు. వడ్డీ లేని రుణాలు నయా పైసా కూడా ఇవ్వలేదన్నారు. అభయ హస్తం పథకం అమలు చేయకుండా, వారి డబ్బు తిరిగి ఇవ్వకుండా మహిళలను దగా చేస్తుందన్నారు. పొదుపు చేసిన సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ ఇవ్వడం లేదన్నారు. రూ.10లక్షల వరకు ఇస్తామన్న వడ్డీ రుణాలు వట్టిమాటగా మిగిలిందన్నారు. ఆమ్ ఆద్మీ ద్వారా సభ్యురాలి పిల్లల చదువులకిచ్చే స్కాలర్‌షిప్, సభ్యురాలు మరణిస్తే ఇవ్వాల్సిన ఆర్థిక సహాయం, జీవనజ్యోతి, ఎస్సీ, ఎస్టీ మహిళకు ఇచ్చే రాయితీ, ఇన్సూరెన్స్ తదితర స్కీంలన్నింటికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరిచిందన్నారు. వీఓఏలకు పని భారం పెరిగిందన్నారు. వీరు 18 రకాల పనులు చేయాల్సి వస్తుందన్నారు. దినసరి కూలీకి నెల మొత్తం వచ్చే అంత కూడా వీరి వేతనాలు లేవన్నారు. ఐకెపి సిబ్బందికి వేతనాలు సకాలంలో రావటం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. అభయ హస్తం పథకం అమలు చేయాలని లేదా తొమ్మిది శాతం వడ్డీ కలిపి చెల్లిస్తాం అన్న హామీని అమలు చేయాలని, 57 సంవత్సరాల నిండిన వారికి ఆసరా పెన్షన్ మంజూరు చేయాలని, రూ.20 లక్షలు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.సమతా, ఎస్.లక్ష్మి, రేష్మ, దేవక్క పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని డీఈ ప్రసాద్ కోరారు. మండలంలో సుమారు రూ.2 కోట్ల విద్యుత్ బిల్లులు బకాయి ఉన్నాయని, వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. నేటి నుండి డివిజన్ నుండి విద్యుత్ బకాయిలు వసూలు చేయడం కోసం ప్రత్యేక బృందాలు వస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ బిల్లు బకాయి ఉన్న ఇండ్లలో విద్యుత్ సరఫరా నిలిపేస్తారని పేర్కొన్నారు. ప్రతి ఒక వినియోగదారుడు సహకరించి విద్యుత్ బిల్లు చెల్లించాలని కోరారు.

## విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంచాలి

**నవతెలంగాణ-నార్నూర్**

విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంచాలని జిల్లా మానిటరింగ్ టీం సభ్యులు భరత్ చౌహాన్, శ్రీనివాస్, దావిత్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని గుంజాల, బలాన్‌పూర్, నాగల్ కొండ, తాడిహత్నూర్ గ్రామంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల కనీస



అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు కొనసాగుతున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థులకు ఇప్పటివరకు పూర్తయిన పాఠ్యాంశాలపై ఆరా తీశారు. వారి వెంట ఎంఈఓ రాపెల్లి ఆశన్న, సీఆర్పీ సుభాష్, సభ్యులు తిరుపతి ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## వాలీబాల్ పోటీలను ప్రారంభించిన వైస్ ఎంపీపీ

**నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్**

మండలంలోని అంకాపూర్ గ్రామంలో శ్రీవిఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను వైస్ ఎంపీపీ జంగు పటేల్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లింగు గూడ సర్పంచ్ సిడాం లక్ష్మణ్, అంకాపూర్ ఉపసర్పంచ్ కొడప భీంరావు, మాజీ సర్పంచ్ మర్సకొల కేశవరావు, వార్డ్ సభ్యులు సిడాం గణపతి, మర్సకొల పవన్ పటేల్, యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి కాంగ్రెస్

- డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్ అన్నారు. సోమవారం పట్టణంలోని కేఆర్కే కాలనీలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జూడో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం, బీజేపీ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టారు. సాజిద్ ఖాన్ మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రభుత్వ వ్యవస్థలను మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం తన మిత్రులైన బడా వ్యాపారులకు అప్పనంగా అమ్మేస్తున్నారని అన్నారు. అలా కాకుండా స్వతంత్ర వ్యవస్థలైనటువంటి న్యాయవ్యవస్థ, పత్రికా రంగ స్వేచ్ఛను అధికారమనే అస్త్రాన్ని ప్రయోగించి, అన్ని వ్యవస్థల గొంతు నొక్కుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాల్లో రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, విద్యార్థుల ఫీజుల రియంబర్స్‌మెంట్ రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, కౌన్సిలర్ ముబారక్, జిల్లా ఎస్టీ సెల్ చైర్మెన్ సెడ్మకి ఆనంద్ రావు, జిల్లా సేవాదల్ చైర్మెన్ భేదోడ్కర్ మోతీరాం, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు సమీర్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాంబ్లీ శివాజీ, ఆదిలాబాద్ అసెంబ్లీ ఎస్సీ సెల్ చైర్మెన్ చంద్రాల రాహుల్, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ సాంగ రాజు యాదవ్, మావల మండల సీనియర్ నాయకులు గౌస్ పాల్గొన్నారు.

## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

**నవతెలంగాణ-బాసర**

మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సునీత విశ్వనాథ్ పటేల్ అధ్యక్షతన సాదాసీదాగా కొనసాగింది. ముందుగా ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సాలాపూర్ సర్పంచ్ మాధవరావు అంగన్‌వాడి సెంటర్లలో టీచర్లు పౌష్టికాహారం సరిగా అందించడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాబోయే వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ నర్సింగ్ రావు, ఎంపీటీసీ ప్రభాకర్, దిగంబర్, ఎంపీడీఓ నాగనాథ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

ఈ నెల 22న ఆదిలాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పిట్ల రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16, 18, 20 సంవత్సరాల బాల బాలికలకు 400 మీటర్ల పరుగు పోటీ, అండర్-18 (యూత్ అథ్లెటిక్స్) బాల బాలికలకు అన్ని ఈవెంట్స్‌లలో వేరువేరుగా జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారు ఈ నెల 25, 26 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పుట్టిన తేది ధృవ పత్రం లేదా ఎస్ఎస్సీమెమో, ఆధార్ కార్డు తీసుకొని ఉదయం 8:30 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు ప్రతి ఒక్కరూ రూ.50/- ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9492136510 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## పట్టణంలో మరో ద్విచక్ర వాహనం చోరీ

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

ఆదిలాబాద్ పట్టణంలో వరుసగా ద్విచక్రవాహనాలు దొంగతనానికి గురవుతున్నాయి. తాజాగా మరో ద్విచక్ర వాహనం సోమవారం తెల్లవారుజామున చోరీ అయినట్టు బాధితుడు పేర్కొన్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక అశోక్ రోడ్ సమీపంలో నివాసం ఉంటున్న షేర్లవార్ రవి తన బుల్లెట్ వాహనాన్ని రాత్రి 12 గంటలకు ఇంటి ముందు నిలిపి తాళం వేశాడు. ఉదయం ఆరు గంటలకు చూసే సరికి కనబడకుండా పోయింది. దీంతో ఆయన తన వాహనం కోసం పలు చోట్ల గాలించిన లభ్యం కాలేదు. దీంతో వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సైతం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## చిన్నారులకు అక్షరాభ్యాసం



**నవతెలంగాణ-కడెం**

మండలంలోని పెద్దూర్ గ్రామంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నాడు చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెద్దూర్ సర్పంచ్ అనుషా లక్ష్మణ్ హాజరయ్యారు. అనంతరం చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ కడెం క్లస్టర్ సూపర్‌వైజర్ రాధా, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనేశ్వర్ అంగన్‌వాడీ టీచర్ నాగవత్ జ్యోతి లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న శివరాత్రి ఉత్సవాలు

**నవతెలంగాణ-లక్ష్మణచాంద**



మండలంలోని శివాలయంలో భక్తుల సందడి కొనసాగుతుంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. బాబాపూర్ శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో భక్తుల రద్దీతో కిటకిటలాడుతుంది. వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. నిర్మల్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్ఎంఓగా పని చేస్తున్న డాక్టర్ వేణుగోపాల కృష్ణ బాబాపూర్ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మెన్ సురేష్ రెడ్డి, బాబాపూర్ సర్పంచ్ శ్రీవిద్య, ఎస్సై రాహుల్ గైక్వాడ్, సిబ్బంది సునీల్, సంజు, అశోక్, సిద్దు తదితరులు డాక్టర్ వేణుగోపాల కృష్ణ డాక్టర్ నీలిమ దంపతులను ఘనంగా సన్మానించారు.

# శిక్షల శాతం పెరిగినప్పుడే నేరాలు తగ్గుతాయి

- ఆదిలాబాద్ జిల్లాలో మల్టీ జోన్-1 ఐజీ పర్యటన



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

న్యాయస్థానంలో నేరస్తులకు శిక్షల శాతం పెరిగినప్పుడే నేరాలు తగ్గుతాయని మల్టీ జోన్-1 ఐజీ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన పర్యటించారు. ముందుగా జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పుష్పగుచ్చాలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో, పోలీసు కార్యాలయం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో ముందస్తు సమాచారాన్ని సేకరించడం కీలకమైన అంశమని పేర్కొన్నారు. జిల్లా మహారాష్ట్ర సరిహద్దున ఉన్నందున అంతర్రాష్ట్ర నేరస్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున జాతీయ రహదారులపై ఎల్లప్పుడూ పెట్రోలింగ్ నిర్వహిస్తుండాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా సీసీటీవీల కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని అన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం చేకూర్చే విధంగా పోలీసు వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని పెంపొందించే విధంగా దర్యాప్తును చేపట్టాలని సూచించారు. అనవసరంగా అనుమానితులను, సాక్షులను పోలీస్ స్టేషన్‌లకు పిలిచి ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవద్దని అన్నారు. జిల్లా వ్యాప్తంగా మట్కా, గంజాయి, పేకాట, వ్యభిచారం లాంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అంతమొందించాలని తెలిపారు. అదేవిధంగా పోలీసు ముఖ్య కార్యాలయం సిబ్బందితో మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వర్తించాలంటే వారికి వచ్చే ప్రయోజనాలు సరైన సమయంలో వచ్చినప్పుడే సాధ్యమైతుందని తెలిపారు. పోలీసు సిబ్బందికి సరైన సమయంలో సెలవులు కానీ, అత్యవసర సమయంలో సిబ్బంది తీసుకునే లోన్లు తదితర అంశాలు వెనువెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, గిన్నెల సత్యనారాయణ, చిందం దేవిదాస్ ఐజీకి పూలమొక్క అందించి శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు బి.రాములు నాయక్, సి.సమయ్ జాన్ రావు, డీఎస్పీలు వి.ఉమేందర్, ఉమామహేశ్వరరావు, పోతారం శ్రీనివాస్, కార్యాలయం ఏఓ యూనుస్ అలీ, సూపరింటెండెంట్లు జోసెఫిన్, గంగాధర్, సీసీ దుర్గం శ్రీనివాస్, సీఐలు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి

**నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్**



ప్రజావాణిలో వచ్చే అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. అర్జీదారు ఒకే సమస్యపై పలు మార్లు రాకుండా స్పష్టమైన సమాచారాన్ని రాత పూర్వకంగా అర్జీదారునికి తెలియజేయాలని అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించి, జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల సమస్యలకు సంబంధించిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుదారు తమ సమస్యకు సంబంధించిన అర్జీని అందజేసినపుడు అట్టి అర్జీని పరిశీలించి, ఆయా శాఖల అధికారులు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారం అవుతుందా లేదా అనే విషయాన్నీ దరఖాస్తుదారునికి రాతపూర్వకంగా సమాచారాన్ని అందించాలని అన్నారు. ఒకే సమస్యపై దరఖాస్తుదారు పలు మార్లు ప్రజావాణిలో రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై అధికారులు తీసుకున్న చర్యలకు సంబంధించిన వివరాలను ప్రజావాణి వెబ్ సైట్ లో వారంలోగా అప్లోడ్ చేయాలనీ అన్నారు. అధికారులు కలెక్టర్‌కు అందించే ఫైల్‌లను ఈ ఆఫీస్ ద్వారా పూర్తి సమాచారంతో అందజేయాలని అన్నారు. అంతకుముందు భూ సమస్యలు, ఫించన్, ఉపాధి, తదితర సమస్యలపై అర్జీలను కలెక్టర్ స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు తదుపరి చర్యలకు అందించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ఎన్.నటరాజ్, రిజ్వాన్ బాషా షేక్, ఆర్డీఓ రమేష్ రాథోడ్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలి



**నవతెలంగాణ-ఇచ్చోడ**

రోడ్డు భద్రత నియమాలను వాహనదారులు తప్పకుండా పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ బిక్షపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలను ఆపి సరైన పత్రాలు లేని వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ ట్రాన్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ ఆదేశాల మేరకు అదిలాబాద్ జిల్లాలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో సరైన పత్రాలు లేని సుమారు 60 వాహనాలను పట్టుకున్నట్లు తెలిపారు. వాహనదారుడు స్వచ్ఛందంగా టాక్సీ కట్టుకుంటే కేవలం 50 శాతం పెనాల్టీ పడుతుందని అన్నారు. ఒకవేళ వాహనం పట్టుబడి కేసు నమోదు అయితే రూ.200 పెనాల్టీ పడుతుందని వాహనదారులు గమనించాలని కోరారు. వాహనాదారుడు వాహనానికి ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని తెలిపారు. వారి వెంట అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సీహెచ్ రామారావు ఉన్నారు.

# అర్హులైనా ఇండ్లు రాలేదంటూ ఆందోళన

**నవతెలంగాణ-ఖానాపూర్**

అన్ని అర్హతలు ఉన్న తమకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాలేదని సోమవారం ఖానాపూర్ పట్టణానికి చెందిన ఆయా కాలనీలకు సంబంధించిన మహిళలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అధికారులు సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించాలని అన్నారు. ఎన్నో ఏండ్లుగా ఇండ్లు లేక తాము అవస్థలు పడుతున్నామని అన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని అన్నారు. అనంతరం తహసీల్దార్ రాజమోహన్, నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించారు. తహసీల్దార్ తిరిగి దరఖాస్తులను పరిశీలిస్తామని, న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.




# సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించాలి



**నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్**

సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలను సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను బంజారా సాంప్రదాయ పూజ కార్యక్రమాలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించాలని అన్నారు. షామియానాలు, బారికేడింగ్, భోజనం, మరుగుదొడ్లు, తాగునీరు, వైద్యసేవలు, రవాణా, సౌండ్ సిస్టం, తదితర ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులకు కేటాయించడం జరిగిందని, సంబంధిత అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టి, జయంతి వేడుకలను విజయవంతం చేయాలనీ అన్నారు. వివిధ గ్రామాల నుండి జయంతి వేడుకలకు వచ్చే వారికీ ఆర్టీసీ ద్వారా అదనంగా బస్సులను ఏర్పాటు చేయాలనీ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. వివిధ గ్రామాల నుండి వచ్చే వారికీ ఉత్సవ కమిటీ సూచనల మేరకు వాహనాలను ఏర్పాటు చేయాలనీ రవాణా, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీరు, మొబైల్ టాయిలెట్ బస్సు ఏర్పాటు చేయాలనీ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలు, వాహన పార్కింగ్‌ల ఏర్పాట్లను పోలీస్ యంత్రాంగం నిర్వహించాలని అన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. జయంతి వేడుకలకు హాజరయ్యే వారందరికీ భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయాలనీ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. జయంతి కార్యక్రమానికి వచ్చే వారికీ వైద్య పరీక్షల నిర్వహణకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలనీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఆర్డీఓ రమేష్ రాథోడ్, డీఆర్డిఓ కిషన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

**నవతెలంగాణ-దిలావర్‌పూర్**

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని రాష్ట్రస్థాయి బృందం సభ్యులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు అంశాలను వివరించారు. పదో తరగతి విద్యార్థుల ప్రగతిని పరిశీలించి, తగు సూచనలు చేశారు. ప్రతీరోజు బడికి హాజరు కావాలని, చదివిన అంశాలను ఎప్పటికప్పుడు సాధన చేయాలని వివరించారు. అత్యంత ప్రణాళికతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. పాఠశాలలో ప్రత్యేక తరగతుల నిర్వహణ, ఎండీఎం సమాధాన పత్రాల మూల్యాంకనం, వారాంతపు పరీక్షల నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలను సందర్శించిన వారిలో రాష్ట్రస్థాయి బృందం సభ్యులు పోతారెడ్డి అశోక్, ప్రతాప్, నారాయణవర్మ, నాగుల రవి, జిల్లా మానిటరింగ్ అధికారి నర్సయ్య, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, సీఆర్పీ గంగన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## జోడో యాత్రను విజయవంతం చేయాలి

**నవతెలంగాణ-బోథ్**

హాత్ సే హాత్ జోడోయాత్రను విజయవంతం చేయాలని మండల కన్వీనర్ కుర్మే మహేందర్ అన్నారు. ఈ నెల 22న మండలంలోని కనుగుట్ట గ్రామపంచాయతీలో ప్రారంభించనున్న జోడోయాత్రను ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అలాగే జరగబోయే కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్, ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఈ యాత్రను కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీలు సర్పంచ్‌లు, నాయకులు కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## గ్రామాభివృద్ధికి సహకరించాలి



**నవతెలంగాణ-నార్నూర్**

గ్రామాభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ రాథోడ్ మధుకర్ అన్నారు. సోమవారం తాడిహత్నూర్ గ్రామపంచాయతీలో వార్డు సభ్యులు, గ్రామస్తులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఎండాకాలం సమీపిస్తున్న తరుణంలో వాడలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. సీసీ రోడ్డు లేని వాడలో సీసీ రోడ్లు నిర్మిస్తామని అన్నారు. డ్యామేజ్ అయిన రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని అన్నారు. పంచాయతీ అనుమతి లేకుండా రోడ్లను తవ్వరాదని సూచించారు. వాడలో ఉన్న పలు సమస్యలను గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చారు. గ్రామసభలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, ఉపసర్పంచ్ విష్ణు, కార్యదర్శి కొల రాజశేఖర్, వార్డు సభ్యులు సుభాష్, గణేష్, అశ్విని, నాగిబాయి, శివాజీ, కారోబారి దినేష్ జాదవ్, గ్రామ పెద్దలు ఉన్నారు.

## డా. వేణుగోపాలచారికి ఘన సన్మానం




**నవతెలంగాణ-నిర్మల్**

తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి, తొలి సారిగా నిర్మల్‌కు విచ్చేసిన మాజీ కేంద్ర మంత్రి డా.వేణుగోపాలచారిని జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ పట్టణ కమిటీ తరపున మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛాన్ని అందచేసి, శాలువతో సన్మానించారు. అంతకు ముందు పురపాలక సంఘం చైర్మెన్ ఛాంబర్ విచ్చేసిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పట్టణ కమిటీ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యులు బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎండీ నజీరొద్దిన్, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, వార్డు అధ్యక్షప్రధాన కార్యర్శులు పాల్గొన్నారు.

## ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవ కరపత్రాల విడుదల

**నవతెలంగాణ-ఖానాపూర్**

ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలను సోమవారం స్థానిక విద్యానగర్ కాలనీలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు విప్లవోద్యమం ఆరంభమై 103 ఏండ్ల కాలమైందని శతాబ్ది ఉత్సవాలను నిర్వహించుకున్నామని అన్నారు. ప్రజా ఉద్యమాలు వర్గ పోరాటాల వెల్లువలతోనే అంతిమంగా సాయుధ పోరాటం ద్వారానే ఈ వ్యవస్థను మార్చుటకు ప్రతి ఒక్కరూ చైతన్యంతో కృషి చేయాలని అన్నారు. ఫిబ్రవరి 22న ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన నిర్వహించాలని, పార్టీ జెండాలను ఎగురవేయాలని సభలు సమావేశాలు జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా పార్టీ ఖానాపూర్ సబ్ డివిజన్ నాయకులు జక్కుల రాజన్న, కుంచపు ఎల్లయ్య, దసంఢ్ల సుదర్శన్, బీఎల్ వర్మ, మూన్వర్, పూసం లక్ష్మణ్, కొమరం మంత్, భగవంతురావు పూసం నాందేవ్, జైతూ కాంతారావు, దుర్భజన కొమరం లక్ష్మి, సుశీల, ధ్రువ, గంగామణి పాల్గొన్నారు.

## అక్రమ కలప పట్టివేత

- కలపను తరలిస్తున్న కారు సీజ్

**నవతెలంగాణ-కడెం**



అక్రమంగా కలపను తరలిస్తున్న కారును సోమవారం అటవీ అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... జన్నారం వైపు నుండి కడెం వైపుగా కారులో కలప తరలిస్తున్నారని ఎఫ్ఆర్ఓ అనితకు అందిన సమాచారం మేరకు డీఆర్ఓ సిద్దార్థ, ఎఫ్బీఓ హలీం అటవీ సిబ్బందితో కలిసి మండలంలోని పాండావపూర్ క్రాస్ రోడ్ వద్ద సివిల్ డ్రెస్‌లో నిఘా పెట్టి అనుమానస్పదంగా వస్తున్న ఏపీ 29 బీచ్ 4000 నెంబర్ గల స్విఫ్ట్ డిజైర్ కారును ఆపే క్రమంలో కారు ఆపకుండా అటవీ చెక్ పోస్ట్ వైపు వేగంగ వెళ్లడంతో అటవీ చెక్ పోస్ట్ వద్ద అటవీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. కారు పాండావపూర్ గ్రామంలోకి వెళ్లగా అటవీ అధికారులు వెంబడించడంతో కారును ఆపి నిందితులు ఇద్దరు పరార్ అయ్యారన్నారు. పట్టుకున్న కారును సీజ్ చేసి అటవీ కార్యాలయానికి తరలించిన కలప విలువ రూ.40వేల 279 ఉంటుందని డీఆర్ఓ సిద్ధార్థ తెలిపారు. అక్రమంగా కలప తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో బేస్ క్యాంప్ సిబ్బంది పోషగౌడ్, వినోద్, జక్కుల రాజన్న, సతీష్ ఉన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

**నవతెలంగాణ-ఇచ్చోడ**

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని కాగ్నే పరశు రాం మహారాజ్ అన్నారు. సోమవారం మండలంలోని గాంధీనగర్ గ్రామంలో ఏడు రోజుల పాటు కొనసాగిన అఖండ హరినామ సప్తహ సోమవారం ఉదయం గ్రామస్తులు ముగింపు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా కాగ్నే పరుశురాం మహారాజ్ భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుట్టే మాధవ్, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 21 ఫిబ్రవరి 2023


## సీపీఐ ప్రజానాట్య కళాకారునికి ఘన నివాళి

నవతెలంగాణ-రామకష్ణాపూర్

పట్టణంలోని స్థానిక జ్యోతినగర్‌కు చెందిన సీపీఐ బస్తి కార్యదర్శి చొప్పదండి దుర్గ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. దుర్గ పార్థివ దేహానికి సీపీఐ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ నివాళ్లు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మిట్టపెల్లి పౌలు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎండీ అక్బర్‌అలీ, ఇప్పకయాల లింగయ్య, సీపీఐ క్యాతనపల్లి, మందమర్రి మున్సిపల్ కార్యదర్శులు కమెరా దుర్గరాజు, మిట్ట పెల్లి శ్రీనివాస్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు వనం సత్యనారాయణ ,పెండ్యాల కమలమ్మ ఉన్నారు. విషయం తెలుసుకున్న జీఎస్‌ఆర్ అధినేత డాక్టర్ రాజా రమేష్ పార్థివ దేహానికి నివాళులు అర్పించి దహన సంస్కరణలకు ఆర్థిక చేయుతను అందించారు.

## జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్

తాగుడికి బానిసై జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపారు. నస్పూర్ గ్రామానికి చెందిన బద్రి రాజేష్ (33)కు 12 సంవత్సరాల క్రితం వివాహం జరగగా గత కొంతకాలం నుంచి తాగుడికి బానిసై భార్యాభర్తలకు మనస్పర్థలు వచ్చాయని, భార్య పిల్లలతో భీమారంలో నివాసం ఉంటున్నట్టు తెలిపారు. ప్రస్తుతం రాజేష్ ఒంటరిగానే నస్పూర్‌లో ఉంటూ డ్రైవర్గా పనిచేస్తున్నాడని, ఆదివారం రాత్రి ఇంట్లో ఇనుప పైపుకు ఉరివేసుకొని చనిపోయి ఉండగా, సోమవారం ఉదయం రాజేష్ అన్న ప్రశాంత్ చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాజేష్ తాగుడికి బానిసై ఒంటరితనంతో మానసికంగా బాధపడుతూ జీవితంపై విరక్తితో ఉరివేసుకొని చనిపోయాడని మతుని అన్న ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

## అంతర్గత మార్కుల పరిశీలన

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

గజ్జిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులు పరిశీలన సోమవారం నిర్వహించారు. మడవి హనుమంతు, గుళ్ళపల్లి రవిశంకర్, డి.గంగాభవాని పదోతరగతి విద్యార్థులు అంతర్గత నిర్మాణాత్మక మూల్యాంకనం పరిక్షా పత్రాలు, మార్కులను పరిశీలించి, తగు సూచనలు సలహాలు చేసి ధృవీకరణ పత్రాన్ని ప్రధానోపాధ్యాయులు ఏటుకూరి శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో తాడె పండరినాథ్, మోటూరి అన్నపూర్ణ, పందిరి వనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు విద్యాసంస్థలకు సెలవు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కళాశాలలకు స్థానిక సెలవు ప్రకటిస్తున్నట్టు ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సెలకు దినానికి బదులుగా మార్చి నెల రెండవ శనివారం అయిన 11వ తేదీన విద్యాసంస్థలు నిర్వహించాలని తెలిపారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం



నవతెలంగాణ-జన్నారం

రక్తదానం చేయటమంటే మరొకరికి ప్రాణదానం చేయటమేనని మంచిర్యాల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాయ్స్ హై స్కూల్లో తల సేమియా వ్యాధిగ్రస్తుల కోసం రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో తాహసీల్దార్ ఇట్యాల కిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని మంచిర్యాల ఆర్డీవో ఏ.వేణుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల సేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం చాలా గొప్ప విషయం అన్నారు. ఈ మెగా రక్తదాన శిబిరానికి సహకరించిన యువజన సంఘాల నాయకులకు ప్రజాప్రతినిధులకు అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సందర్భంగా తాసిల్దార్ కిషన్‌ను శాలువాతో సన్మానించారు. ఈ రక్తదాన శిబిరంలో రిటైర్డ్ హైదరాబాద్ కలెక్టర్ కలమడుగు వాసి శర్మ నాయక్ రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. బీఆర్ఎస్ యువ నాయకులు పూర్ణచంద్ర నాయక్, యువసేన సభ్యులు రక్తదానంలో పాల్గొన్నారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో మొత్తం 81 మంది రక్తదానం చేశారని తహసీల్దార్ పేర్కొన్నారు.

## రేపు మాయిలమ్మ బోనాల జాతర

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని ఆలుగామ గ్రామంలో బుధవారం మాయిలమ్మ బోనాల జాతర జరుగుతుందని సర్పంచ్ కుమ్మరి సంతోష్ తెలిపారు. మంగళవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆట ఆటలతో అమ్మవార్లను కొలుస్తారు. మరుసటి రోజు బోనాల జాతర ఉంటుందని తెలిపారు. ప్రతి సంవత్సరం సంప్రదాయంగా వచ్చే ఈ జాతరను గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ జాతరకు గ్రామ చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు సరిహద్దు మహారాష్ట్ర ప్రాంతం నుంచి వచ్చి తమ మొక్కలను తీసుకుంటారని పేర్కొన్నారు.

## రేపు గోండ్వాన గణతంత్ర పార్టీ సమావేశం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని నవెదరి గ్రామంలో గోండ్వాన గణతంత్ర పార్టీ సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గావునె బాపురావు సోమవారం తెలిపారు. ఈ సమావేశంలో జెండా ఆవిష్కరణతో పాటు మండల కమిటీ ఎన్నికోనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి కర్షక, కార్మిక, బడుగు బలహీన వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరుతున్నారు. ఆయన వెంట గోండ్వాన గణతంత్ర పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పర్చెటి కేశవరావు, జిల్లా అధ్యక్షుడు తుమ్రం సందీప్‌కుమార్ ఉన్నారు.

## ఆలయం నిర్మాణానికి విరాళం అందజేత

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదుర్గా దేవి ఆలయ నిర్మాణానికి లక్షెట్టిపేట్ వాస్తవ్యులు మైలారం శంకరయ్య వారి కుమారులు, మైలారం శ్రీనివాస్, మైలారం సుధాకర్‌లు రూ.51116 విరాళాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ జాడి గంగాధర్ మాట్లాడుతూ దుర్గాదేవి, ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. ఆలయం దాదాపు 60 శాతం పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. దాతల సహకారంతో ఆలయాన్ని త్వరలో నిర్మించి ప్రారంభోత్సవం చేయడానికి, పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ వార్డు సభ్యులు జాడి రాజన్న, చిందం చంద్రయ్య, జాడి వెంకట్ పాల్గొన్నారు.

## పేదలకు ఇండ్లు నిర్మించేది బీజేపీయే

నవతెలంగాణ-బెజ్జూర్

బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ముందుగా నిరుపేదలకు ఇండ్లు నిర్మించి ఇస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని కృష్ణపెల్లి, పాపన్‌పేట్, సోమిని గ్రామాల్లోని శక్తి కేంద్రాల్లో ప్రజా గోస– బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి చేసిన ఘనత స్వర్గీయ పాల్వాయి పురుషోత్తంరావుదేనని, మండలంలోని ప్రతి ఒక గ్రామంలో ఇప్పటికీ కనిపించే పెంకుటిండ్లు ఆయన కట్టించినవేనన్నారు. ప్రతి గ్రామానికి రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించారన్నారు. ప్రతి ఒక కార్యకర్త భారతీయ జనతా పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు జాడి దిగంబర్, మండల ఇన్‌చార్జి సమీర్ గుప్తా, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కుమ్మెర తిరుపతి, ప్రధాన కార్యదర్శి ఉమ్మెర బాలకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ తాళ్ల రామయ్య, మాజీ సర్పంచ్‌లు లింగాల శంకరయ్య పాల్గొన్నారు.

## 23న జిల్లాస్థాయి అథ్లెటిక్ సెలక్షన్స్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 23వ తేదీన జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల మైదానంలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట్నాక విజయ్ కుమార్ ప్రధాన కార్యదర్శి శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అథ్లెటిక్స్‌లో భాగంగా 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంపు, షార్ట్ పుట్ లాంటివి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీనిలో గెలుపొందిన వారు హనుమకొండలో ఈ నెల25, 26 తేదీలలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం కోచ్ విద్యాసాగర్ 8008090626 నెంబర్‌ను పీఈటీ యాదగిరిని సంప్రదించాలని పేర్కొన్నారు.

# ముగిసిన వేలాల జాతర

- కొనసాగుతున్న పారిశుధ్య పనులు

నవతెలంగాణ-జైపూర్



వేలాల జాతరకు తరలివచ్చిన భక్తులు సోమవారం ఉదయం నుండి తిరుగు పయనమయ్యారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఏర్పాట్లు చేయడం కోసం తలమునకలైన అధికారులకు భారం దింపుకున్నట్లైంది. గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు మాత్రం భారం మిగిలే ఉంది. మహా శివరాత్రి మొదలు మూడు రోజుల పాటు కొనసాగిన జాతర ప్రశాంతంగా ముగియడంతో గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు. ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మల్టీవర్కర్స్ పారిశుధ్య పనుల నిర్వహణలో నిమగ్నమయ్యారు. గోదావరి నదీ తీరంతో పాటు గ్రామ పంచాయతీ పరిధిలో సందర్శకులు వదలి వెళ్లిన వ్యర్థాలను తొలగిస్తున్నారు. మురికి నీరు నిల్వ లేకుండా శుభ్రం చేస్తూ దుర్వాసన వెదజల్లకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నారు. గ్రామ పంచాయతీ మల్టీవర్కర్లతో పాటు అదనంగా ఏర్పాటు చేసిన మరో 15 మందితో పారిశుధ్య పనులు కొనసాగుతున్నట్లు ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. వారం పది రోజులు శ్రమిస్తే తప్ప గ్రామ పంచాయతీ పరిధి పరిసరాలను పరిశుభ్రం చేసుకోలేమని గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్యాగ శ్యామల లక్ష్మణ్ తెలిపారు.

**ఆర్థిక భారం తప్ప గ్రామ పంచాయతీకి ఆదాయం లేదు**



వేలల్లో తరలివచ్చే భక్తులతో గ్రామ పంచాయతీకి ఆర్థిక భారం తప్ప ఆదాయం అంతంత మాత్రమే. భక్తులు సమకూర్చిన కట్నకానుకలు దేవాదాయ శాఖ ఖాతాలో జమ చేస్తుండగా ఏర్పాట్లు మాత్రం గ్రామ పంచాయతీ చేస్తోంది. పార్కింగ్, టెంకాయలు, లడ్డూ ప్రసాదం టెండర్ల ద్వారా వచ్చే ఆదాయంతో భక్తుల అవసరాల మేరకు సౌకర్యాలు కల్పించాలి. టెండర్ల ద్వారా వచ్చే ఆదాయం తప్ప మరో రకమైన ఆదాయం లేకపోవడంతో జాతర నిర్వహణ గ్రామ పంచాయతీకి శక్తికి మించిన భారమవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 3 నుండి 4 లక్షల మంది భక్తులు ప్రతి సంవత్సరం జాతరలో పాల్గొంటుండగా వారం రోజుల నుండే ఏర్పాట్లు చేయాల్సి వస్తోంది. అదేవిధంగా జాతరకు సంబంధించిన ప్రతి విషయంలోనూ గ్రామ పంచాయతీ బాధ్యత వహించాల్సి రావడం ఆర్థిక భారంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జాతర ఏర్పాట్లకు సంబంధించి అదనపు నిధులు సమకూర్చుతే తప్ప గ్రామ పంచాయతీకి ఆర్థికంగా లాభం చేకూరే పరిస్థితి లేదు.

**ఆధాయం రూ.46.38 లక్షలు**

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు కొనసాగిన వేలాల మల్లన జాతర ద్వారా ఆలయానికి రూ. 46.38 లక్షల ఆదాయం సమకూరింది. సోమవారం వేలాల గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ క్యాంపు వద్ద మల్లన్నకు భక్తులు సమకూర్చిన కట్న కానుకలను లెక్కించారు. గుట్టపై వెల్సిన గట్టు మల్లన్నకు హూండి ద్వార రూ.11 లక్షల 88 వేల 436 , టెంకాయాల టికెట్ల ద్వార రూ.4 లక్షల 57 వేలు, 260 లడ్డు వేలం ద్వార రూ.1 లక్షల 40 వేలు, టెంకాయల వేలం ద్వార రూ.13 వేల 500 సమకూరింది. వేలాల గ్రామంలో గల మల్లిఖార్జున స్వామి ఆలయం ఆధాయం అన్ని కలుపుకుని రూ.28 లక్షల 39 వేల, 242 రూపాయలు వేలాల మల్లన్నకు భక్తుల ద్వార అందిన ఆధాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ ఈఓ రమేశ్ తెలిపారు.

# పంచాయతీ కార్మికుల పాదయాత్ర

నవతెలంగాణ-ఆసిఫాబాద్




పంచాయతీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని జీవో నెంబర్ 60 రద్దు చేయాలని డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో పంచాయతీ కార్మికులు పాదయాత్ర చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ఆంజనేయుని విగ్రహం నుండి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 60 రద్దుచేసి మున్సిపల్ సిబ్బందికి ఇస్తున్నట్లుగానే వేతనం చెల్లించాలన్నారు. గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి చేస్తున్న పాదయాత్రకు సంఘీభావంగా యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్తులో మరిన్ని ఆందోళనలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు లోకేష్, జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, గ్రామపంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మోరేశ్వర్, శ్రీకాంత్, నాయకులు శంకర్, రాజు, సమ్మయ్య, నగేష్, పుష్పలత, రాణి, మోతె లక్ష్మి, బాలమ్మ అనిల్, రమేష్, చంద్రశేఖర్, వసంత్ రావు పాల్గొన్నారు.

# బాలురతో సమానంగా బాలికలు రాణించాలి

- జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి
- గ్రామీణ బాలికలకు ప్రతిభా పురస్కారాలు




నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాలురతో సమానంగా బాలికలు రాణించాలని అప్పుడే ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం అవుతాయని జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ బాలికల ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ఎమ్మెల్యే ఆత్రం సక్కులతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతంలోని పాఠశాలలో గత సంవత్సరం 9వ తరగతి చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను మెరిట్ స్కాలర్ షిప్ కోసం ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థినులు బాలురతో పోటీపడి చదవాలన్నారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థినులను ప్రోత్సహించడానికి కోరమండల్ సంస్థ వారు చేసిన కృషిని అభినందించారు. అనంతరం కోరమండల్ సంస్థ జోనల్ మేనేజర్ మనోజ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థినులను ప్రోత్సహించడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రైతులు నాణ్యమైన ఎరువులు వాడాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలతో రైతుల ఆదాయం రెట్టింపు కావాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అతిథులను కంపెనీ ప్రతినిధులు ఘనంగా సన్మానించడంతో పాటు మొదటి బహుమతి కింద రూ.5000 రెండవ బహుమతి రూ.3500 విద్యార్థులకు అందజేయడంతో పటు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు కంపెనీ ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, ప్రసాద్, రుక్మాధర్‌రెడ్డి, నాగరాజు, కుమార్, ప్రియతంరెడ్డి పాల్గొన్నారు.

# ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

నవతెలంగాణ ఆసిఫాబాద్



ధరణి పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి అధికారులతో ధరణి పోర్టల్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలోని 33 మాడ్యూల్స్ ద్వారా అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులను అనుసరించి పూర్తిస్థాయి నివేదిక రూపొందించి అందించాలని తెలిపారు. ధరణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి జిల్లాను ముందంజలో ఉంచేందుకు కృషి చేయాలని తెలిపారు. ధ్రువపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనలను అనుసరించి త్వరగా జారీ చేసేందుకు తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎఫ్ లైన్, కళ్యాణ్ లక్ష్మి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పేరు, విస్తీర్ణం సవరణ కొరకు వచ్చిన దరఖాస్తులను రికార్డుల ప్రకారంగా పరిశీలించి పరిష్కరించాలని, ధరణిలో జరిగిన పనుల పురోగతిపై నిర్ణీత ఫార్మాట్లో నివేదిక రూపొందించి అందజేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వాటిపై పూర్తిస్థాయి నివేదిక రూపొందించి అందజేయాలని తహసిల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వర్ పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సమన్వయంతో చేపట్టారని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేస్తున్న మీడియా ప్రతినిధులు పథకాల పురోగతిని ప్రచారం చేయడంతో పాటు లోపాలను గుర్తించి పరిష్కరించే దిశగా ప్రభుత్వంతో కలిసి కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హత గల ప్రతి జర్నలిస్టు సంక్షేమాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, జిల్లా అభివృద్ధిలో కలిసి పని చేద్దామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల అధికారి వై.సంపత్ కుమార్ పాల్గొన్నారు.

## ముగిసిన జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



నవతెలంగాణ-నస్పూర్

41వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ పోటీలలో చివరి రోజు అన్ని విభాగాలలో తమిళనాడు రాష్ట్ర బాల బాలికల ఆట చూపరులను ఆకట్టుకున్నాయి. అన్ని విభాగాల్లో తమిళనాడు మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. ఈ క్రీడల్లో బహుమతులు పొందిన వారికి మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, జిల్లా పరిషత్ చైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి పాల్గొని బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెలుపు ఓటములు అనేది సహజమని ఓడిపోయిన వారు స్ఫూర్తితో ఆటలో ముందుకు సాగాలని, గెలుపొందిన వారు మరింత క్రీడా స్ఫూర్తిని కనపర్చాలని ఆకాంక్షించారు. మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు తన చిన్నతనంలో ఆడిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడను గుర్తు చేసుకున్నారు. ఈ పోటీలలో పాల్గొన్న వారు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకొని వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని కోరారు. క్రీడా స్ఫూర్తిని కొనసాగిస్తూ బాలికలను సుదూర ప్రాంతాలకు పంపిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సమిష్టిగా హక్కులు సాధించుకోవాలి



నవతెలంగాణ-తాండూర్

సమిష్టిగా హక్కులు సాధించుకోవచ్చని గౌడ జన హక్కుల పోరాట సమితి,(మోకు దెబ్బ) రాష్ట్ర కార్యదర్శి భూసారపు మొండి గౌడ్ అన్నారు. మండలంలోని బోయపల్లిలో గౌడ జనహక్కుల పోరాట సమితి మోకు దెబ్బ జాతీయ క్యాలెండర్‌ను సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. గౌడ కులస్తులు ఐక్యతతో ఉండడం వల్ల సంఘం పటిష్ట పడుతుందని ప్రభుత్వం నుంచి వచ్చే హక్కులను పొందవచ్చునని తెలిపారు. నిరుపేదలైన గీత కార్మికులకు ప్రభుత్వం ఈత చెట్ల పెంపకానికి భూమిని కేటాయించాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువుగట్లపై బంజేరు భూముల్లో ఈతవనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈత వనాల అభివృద్ధి కోసం గౌడ కులస్తులకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పని దినాలు కల్పించాలన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జడ్పీటీసీ బానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి, పేరుమండ్ల భాస్కర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి, పున్నం గౌడ్, గుగ్గిళ్ళ రాజబాబు గౌడ్, పల్లె సత్యనారాయణ గౌడ్, పాలకుర్తి తిరుపతి గౌడ్, రవి గౌడ్, భాస్కర్ గౌడ్, రాజా గౌడ్, నర్సా గౌడ్, మల్లేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మల్లేష్ పాల్గొన్నారు

## సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని చామనపల్లి గ్రామంలో సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఉపాధిహామీ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డుపనులు చేపట్టడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లాలు, మండలాలు, గ్రామాలలో నర్సరీలు, శ్మశాన వాటికలు పచ్చగా దర్శనమిస్తున్నాయని అన్నారు. 29 రాష్ట్రాల్లో లేని అభివద్ధి తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెల్ల మొండి, మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా, వైస్ చైర్మన్ లింగా గౌడ్, కన్నెపల్లి జడ్పీటీసీ సత్యనారాయణ, ఉప సర్పంచ్ మహేష్, సోషల్ మీడియా వారియర్స్, ఇరుగురాల రజాక్, చెన్నూరి సంతోష్ పాల్గొన్నారు.

## అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి

నవతెలంగాణ- సిర్పూర్(టీ)

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని అనుకున్న లక్ష్యాలను సాధించుకునేందుకు కృషి చేయాలని ఎస్సై దికొండ రమేష్ విద్యార్థులకు సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో ఏర్పాటుచేసిన 10వ తరగతి, ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో చదువుకొనే విద్యార్థులు వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వారేనని, తల్లిదండ్రులు ఎంతో ఆశతో తమ పిల్లలు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని, సొసైటీ నిర్వహించే ప్రవేశ పరీక్ష కోసం అనేక ప్రయత్నాలు చేసి సీటు సాధించే వరకు తమ పిల్లలకు భవిష్యత్తులో ఎలాంటి కష్టాలు పడకుండా చదువుకోవాలనే ఉద్దేశ్యంతో గురుకులాల్లో చేర్పిస్తారని అన్నారు. వారి ఆశలు అడియాశలు కాకుండా క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలన్నారు. అలాగే పాఠశాలను వీడనున్న విద్యార్థులు ఇలాగే చదువుకొని భవిష్యత్తులో మంచిస్థానానంలో ఉండాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపల్ కాలోజు బాలరాజు మాట్లాడుతూ గురుకులంలో ఏ విధంగానైతే క్రమశిక్షణతో ఉండి చదువుకున్నారో పై చదువులో కూడా అలాగే క్రమశిక్షణతో ఉండి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. వీడ్కోలు సమావేశంలో పూర్వ విద్యార్థి డాక్టర్ జుమ్మి జోగేందర్ పాల్గొన్నారు.

## వాహన బకాయిలు చెల్లించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

గత కొన్నేండ్ల నుంచి వాహనాలకు సంబంధించిన బకాయిలను చెల్లించాలని ఆసిఫాబాద్ ఎంవీఐ ఉమామహేశ్వర్ వాహనదారులకు సూచించారు. సోమవారం మండలకేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. బకాయిలు పెండింగ్‌లో ఉన్న 9 వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దచ్చే నెల 31వ తేదీ వరకు వాహనాలకు సంబంధించిన బకాయిలను స్వచ్ఛందంగా కార్యాలయానికి వచ్చి చెల్లిస్తే 25 శాతం పెనాల్టీ తీసుకోవడం జరుగుతుందని, కాలపరిమితి దాటితే 50 శాతం పెనాల్టీ తీసుకోబడుతుందని, లేనియెడల తమ సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా బకాయిలు ఉన్న వాహనాలకు వంద శాతం పెనాల్టీ విధించబడుతుందన్నారు. త్వరగా వాహనాలకు సంబంధించిన బకాయిలను చెల్లించే బాధ్యత వాహనదారులపై ఉందని, తమ సిబ్బందికి సహకరించాలని ఆయన తెలిపారు.

## నిర్మల్ చిన్నారులకు నాట్య నంది పురస్కారం

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన చిన్నారులు సంగారి ఆరాధ్య, దాయత్రి సహస్ర కూచిపూడి నాట్యంలో ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన గ్రూప్ డ్యాన్సు పోటీలలో వీరు ప్రతిభ కనబరిచారు. శివోహం పేరిట నిర్వహించిన ఈ నృత్య ప్రదర్శనలో చిన్నారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. నాట్య నంది పురస్కారాన్ని, ప్రశంసాపత్రాన్ని నిర్వాహకుల చేతుల మీదుగా అందుకున్నారు. చిన్నారులను కాలనీవాసులు, ఎస్వీఎస్, సెయింట్ థామస్ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ నవ్య ఉన్నారు.

## పదో తరగతి అంతర్గత మార్కుల పరిశీలన

నవతెలంగాణ - కౌటాల



పదో తరగతి అంతర్గత మార్కుల పరిశీలనను సోమవారం బృందం సభ్యులు పరిశీలించారు. మండల కేంద్రంలోని ఇన్ఫంట్ జీసెస్ పాఠశాల, మయూరి విద్యాలయంలో విద్యార్థులు రాసిన రికార్డులను బృందం సభ్యులు పరిశీలించారు. ఎస్ఏ(1), ఎస్ఏ(2) ఎస్ఏ(3) ఎస్ఏ(4) మార్కుల జాబితాను పరిశీలించి విద్యార్థులను అడిగి పరిశీలించిన పాఠశాలలకు సర్టిఫికేట్‌ను అందజేశారు. కమిటీ సభ్యులు ప్రధాన అధికారి, పీజీ హెచ్ఎం గావుడె హన్మంతు మిగతా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించి అన్నీ సిద్ధం చేసి పెట్టాలని తెలిపారు. వారి వెంట ముంజం శ్యాంరావు ఉన్నారు.

## పాలకులు..కాస్తా కండ్లు తెరవరూ..!



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూర్ నియోజకవర్గంలో పాలన కరువైందనడానికి నిదర్శనం ఈ ఫొటో. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో అధికారుల నిర్లక్ష్యాన్ని, పాలకుల వైఫల్యాన్ని ఈ ఫొటోనే చెబుతోంది. పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గుంతలు పడి తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చలనం లేకపోవడంతో ఓ ఆటో డ్రైవరే స్వయంగా తన ఆటోలో మట్టి తీసుకొచ్చి గుంతల్లో వేసి పూడ్చుతున్నాడు. తన తోటి డ్రైవర్ల కష్టాలు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అబ్దుల్ తహసిన్ అనే ఆటో డ్రైవర్ చేస్తున్న ఈ పని పట్ల పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో పాలన గురించి గొప్పలు చెప్పుకునే పాలకులకు గంపెడు మట్టిపోసే సోయిలేకుండా పోయిందా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## అదృశ్యమైన బాలుడు శవమై తేలాడు



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని గొడిసెర గ్రామానికి చెందిన దత్తహరి-రుక్మిణి దంపతుల కుమారుడు సందేశ్(9) కనిపించకుండాపోయి సోమవారం బావిలో శవమై తేలాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..బాలుడి తండ్రి దత్తుహరి మూడు నెలల క్రితం మృతి చెందడంతో తల్లి రుక్మిణిబాయి నెల రోజుల నుంచి మహారాష్ట్రలోని తల్లిగారి ఇల్లైన అందబోరిలో ఉంటోంది. సందేశ్ భైంసా పాఠశాలలో చదువుకుంటున్నాడు. శివరాత్రి సెలవులకు మేనత్త ఊరైన గొడిసెరకు వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం నుంచి బాలుడు కనిపించకుండాపోయాడు. సోమవారం గోపు బాలాజీ బావిలో మృతదేహం కనిపించడంతో తల్లికి సమాచారం అందించారు. తల్లి రుక్మిణిబాయి కుమారుడు మృతిపై అనుమానాలున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

## మన బస్తీ మన బడి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

పట్టణంలోని చిలకూరి లక్ష్మినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మన బస్తీ మన బడి పనులను సోమవారం ఎమ్మెల్యే జోగు రామన్న ప్రారంభించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ఆవిష్కరించారు. తరగతి గదులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రూ.19లక్షల41వేల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యార్థం అందుబాటులోకి తెచ్చిన నూతన డెస్క్, బెంచీలు ఇతరత్రా వసతులను పరిశీలించి వారితో సరదాగా ముచ్చటించారు. పాఠశాలలో వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన బస్తీ మన బడి కింద తొలి విడతగా ఎంపిక చేసిన పాఠశాలల్లో పట్టణంలో రూ.7కోట్ల45లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. తొమ్మిదేండ్ల కాలంలో విద్యా రంగంలో అనేక నూతన సంస్కరణలను ప్రవేశపెట్టి పేద విద్యార్థుల ఉన్నతికి పాటు పడుతున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు సంద నర్సింగ్, అశోక్ స్వామి, కో ఆప్షన్ ఎజాజ్, జోహుర్, నాయకులు గోలి తిరుపతి, కస్తాల ప్రేమల, బొడగం మమత, దాసరి రమేష్ పాల్గొన్నారు.

## మైనార్టీల రుణాల కోసం ప్రత్యేక ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-జైనూర్

మైనార్టీ యువత స్వయం ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వ అందజేస్తున్న రుణాలకు ధరకాస్తు చేసుకున్న వారికి సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రభుదయ, ఎస్‌బీఐ మేనేజర్ గోపాలకృష్ణ, ఏడీసీసీ బ్యాంకు అధికారులు 423 మంది దరఖాస్తులను పరిశీలించారు. అందులో మొదటి రోజు 198 మంది ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మండలవ్యాప్తంగా మైనార్టీ రుణాల కోసం కేవలం ఆరు యునిట్‌లు ఉన్నట్టు ఎంపీడీఓ పేర్కొన్నారు. అందులో నలుగురికి రూ.లక్ష రుణం కోసం. రూ.రెండు లక్షల కోసం ఇద్దరు యూనిట్టు మంజూరయ్యాయని తెలిపారు. దానికి సంబంధించిన అభ్యర్థుల ధృవీకరణ పత్రాలు పరిశీలిస్తున్నట్టు ఎంపీడీఓ పేర్కొన్నారు.

## కంటి వెలుగు శిబిరాల తనిఖీ

నవతెలంగాణ- కాసిపేట

కాసిపేట మండలంలోని ధర్మారావుపేట, ముత్యంపల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుబ్బారాయుడు తనిఖీ చేశారు. కంటి వెలుగుఎ శిబిరాల నిర్వాహణ, కంటి పరీక్షల విధానం, ఏర్పాట్లను పరిశీలించి వివరాలను వైద్య అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరాల్లో అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయడం జరుగుతుందని, శిబిరాలను సద్వినియోగం చేసుకొని కంటి వైద్య సేవలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు శ్రీ దివ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్




గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. రాష్ట్ర పాదయాత్రకు సంఘీభావంగా జైనథ్ మండలం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, గ్రామపంచాయతీ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులు పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, వాటర్ సప్లై, కారోబార్, బిల్ కలెక్టర్లు, ఆఫీస్ నిర్వహణ వంటి పనులు నిర్వహిస్తున్నారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సుదీర్ఘకాలంగా పోరాడుతున్నామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో గ్రామ అవసరాల ప్రాతిపదిక మీద పంచాయితీ పాలకవర్గం మరికొందరిని నియమించుకుందని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారందరికీ పెంచిన వేతనాలు ఇవ్వకపోవడంతో కొందరికి మాత్రమే వస్తున్న వేతనాలను అందరూ పంచుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అత్యధిక మంది కార్మికులకు రూ.3,500 నుండి రూ. 4,500 వరకు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. వేతనాలు పెంచామనే సాకుతో వివిధ కేటగిరీలను రద్దు చేసి మల్టీపర్పస్ వర్కర్ విధానం తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వం తెచ్చిన 51 జీవో వల్ల కార్మికులకు పని భారం పెరిగిందని అసహనం వ్యక్తం చేశారు. 3నెలలగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు అప్పులపాలై ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫిబ్రవరి 12 నుండి పాలకుర్తి నుండి పాదయాత్ర కొనసాగుతోందన్నారు. జీఓ నెం.60 గ్రామపంచాయితీ కార్మికులకు కూడా వర్తింపజేస్తూ, పారిశుధ్య కార్మికులకు రూ.15,600, కారోబార్, బిల్ కలెక్టర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, వీధి దీపాల నిర్వహణ, వాటర్ సప్లై కార్మికులకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ విభాగంలో పనిచేసే సిబ్బందికి రూ.22,750 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. యాక్ట్ 2/94ను రద్దు చేసి పంచాయితీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించి వారిని అసిస్టెంట్ పంచాయితీ కార్యదర్శులుగా నియమించాలని కోరారు. జీఓ నంబర్ 61ని సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పంచాయితీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.గంగన్న, గ్రామపంచాయతీ జిల్లా కోశాధికారి ఆనందరావు, గ్రామపంచాయతీ కార్మికులు సల్మాన్, రాధ, కత్తి మల్లమ్మ, శంకర్, అడెల్లు, గంగన్న, ఇంద్రజ, లక్ష్మన్న పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణ బాధ్యతగా నిర్వర్తించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ సహదేవరావు



నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

తెలంగాణకు హరితహారం, పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాలలో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్‌లోని పట్టణ ప్రకృతి వనంతో పాటు సెగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామాలను మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రకృతి వనాలలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని, సకాలంలో నీటిని అందిస్తూ వాటి ఎదుగుదలకు తోడ్పడాలని నిర్వాహకులకు సూచించారు. మున్సిపల్ పరిధిలో కేటాయించిన సెగ్రిగేషన్ షెడ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రతిరోజు ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని, వీటిలో ఉపయోగకరమైన చెత్తను వేరుచేసి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో కేటాయించిన వైకుంఠధామాల పనులను త్వరగా పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయడంతో పాటు వైకుంఠధామాలలో నీరు, విద్యుత్ సౌకర్యాలను కల్పించి వినియోగించుకునే విధంగా ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమోద్ పాల్గొన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జూనియర్ సివిల్ జడ్జి షరీనా

నవతెలంగాణ-ఆసిఫాబాద్




చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జ్ షరీనా అన్నారు. మండలంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సు కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలో కోర్టు సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎవరైనా కోర్టులో తమ తరఫున లాయర్‌లను పెట్టుకోలేని పరిస్థితిలో ఉంటే వారికి ఉచిత న్యాయ సహకారం లభిస్తుందని దీనిని ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు మంచి బుద్ధులు నేర్పే బాధ్యత ఉపాధ్యాయులపై తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. అనవసరంగా విద్యార్థులను దండిస్తే చట్టం ప్రకారం శిక్ష ఉంటుందని తెలిపారు. దండనతో కూడిన విద్య సరైనది కాదని ప్రేమతో విద్యార్థులను దగ్గర చేర్చుకోవాలని అన్నారు. సమాజంలో విద్యార్థులు నడుచుకునే విధానాన్ని ఉపాధ్యాయులు తెలియజేయాలన్నారు. ఉపాధ్యాయులు కూడా చట్టాలపై అవగాహన పెంచుకుని ఆ దిశగా విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్‌బాబు, కార్యదర్శి నరహరి, ఏజీపి దీపక్‌రావు, న్యాయవాదులు రాజీవ్ రెడ్డి, ఎంఈఓ మను కుమార్ పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి



నవతెలంగాణ-ఉట్నూర్

మేకలు మేపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై భరత్ సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బీర్సాయిపేట పంచాయతీ పరిధిలోని భూపేటకు చెందిన వజ్రవ్వ(48) బీర్సాయిపేట పంచాయతీ వార్డు సభ్యురాలుగా ఉంటూ మేకలు కాస్తూ కాలం వెళ్లదీస్తుంది. రోజు మాదిరిగానే మృతురాలు మేకలు మేపేందుకు వెళ్లింది. గ్రామ సమీపంలో ఉన్న శంకర్‌కు చెందిన వ్యవసాయ బావిలో నీళ్లు తాగేందుకు వజ్రవ్వ దిగింది. నీళ్లు తాగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందింది. మేకలు ఇంటి ముఖం పట్టడంతో మేకలతో పాటు ఆమె ఇంటికి రాకపోవడం కుటుంబ సభ్యులు గాలించారు. ఊరి పొలిమెరలో ఉన్న బావి సమీపాన చెప్పులు కనిపించడంతో వెంటనే ఇరుగు పొరుగు వారికి విషయం తెలిపారు. స్థానికులు మృతురాలి కోసం బావిలో గాలించగా మృతదేహం లభ్యం అయ్యింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్టు ఎస్సై తెలిపారు.

## రేపు సిర్పూర్(యు) మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జైనూర్

ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు సిర్పూర్(యు) ఎంపీడీఓ మధుసూదన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం బుధవారం ఉదయం 11:30 గంటలకు మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశానికి మండల జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు మండలంలో పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు.

## 27న సప్తాహ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

నవతెలంగాణ-జైనూర్

ఈ నెల 27వ తేదీ నుండి జైనూర్ మండలకేంద్రంలో నిర్వహించనున్న అఖండ హరినామ సప్తాహ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వంజారీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపీనాథ్ గిత్తె, ఆలయ కమిటీ అధ్యక్షుడు పోలిపల్లి నరేందర్ అన్నారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి జిల్లాకేంద్రంలోని జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఠలేశ్వర ఆలయంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం హరి భజన, హరి కీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. తొలిరోజు కార్యక్రమంలో గోవింద్ మహారాజ్‌తో పాటు పలువురు హాజరుకానున్నట్టు వివరించారు. ఈ అఖండ హరినామ సప్తాహకు జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే హజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఉత్తమ్, సుధాకర్, రఘునాథ్ పాల్గొన్నారు.

## ఆహార భద్రత కమిషన్ చైర్మెన్ ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-దిలావర్‌పూర్



తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మెన్ తిరుమల్‌రెడ్డి సోమవారం దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాల్లో రేషన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, రిజిష్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ షాప్ డీలర్లు ప్రామాణికమైన నిలువ ఉండేలా చూడాలని అన్నారు. అందరికీ రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పరిశీలించారు. నర్సాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, రాంపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతం సరిగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. నాణ్యమైన ఆహారం అందిచాలని ఆదేశించారు. ఆయన వెంట దిలావర్‌పూర్ తహసీల్దార్ కరీం, ఎంపీడీఓ మోహన్, ఆర్ఐ సంతోష్, నర్సాపూర్ తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ వనజ, ఎంపీఓ శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ రాంరెడ్డి ఉన్నారు.

## కలెక్టర్ సమీకృత భవన నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టర్ సమీకృత భవన నిర్మాణ పనులను కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి సోమవారం పరిశీలించారు. పనులు నత్తనడకన సాగుతుండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ స్రవంతి, ఆర్‌అండ్‌బీ ఈఈ అశోక్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## పంటలను పరిశీలించిన ఏడీఏ

నవతెలంగాణ- కాసిపేట

మండలంలోని దేవాపూర్ శివారులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పంటలను సోమవారం బెల్లంపల్లి ఏడీఏ సురేఖ పరిశీలించారు. దీంతో పాటు ధర్మారావుపేటలో వరి పంటలను పరిశీలించి ప్రస్తుతం వరి పంటలో కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉండడం గమనించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా వాడడం వల్ల ఉపయోగాలను తెలియజేస్తూ, రైతులకు డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అంజలి, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ తిరుపతిరెడ్డి, కొమురయ్య రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లా స్థాయి అధికారులు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని, అర్జీలు పెండింగ్‌లో ఉంచకూడదని సూచించారు. స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఆదేశించారు. ఫిర్యాదుల విభాగానికి 36 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఎస్-ఎస్ఏ ఉద్యోగులు సోమవారం ఎమ్మెల్యే జోగు రామన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. అందులో పని చేస్తున్న స్పెషల్ ఆఫీసర్, పీజీ సీఆర్టీ, అకౌంటెంట్, ఏఎన్ఎం, కంప్యూటర్ ఆపరేటర్, వంట పని చేసే వారిని క్రమదీకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తమకు రెగ్యులర్ పేస్కేలును అందించి న్యాయమైన డిమాండ్లను సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి హరీష్ రావు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి నివేదించాలని కోరారు. తమ డిమాండ్లకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కేజీబీవీ ఉపాధ్యక్షురాలు సీహెచ్, దీప్తి, జ్యోతి రాణి, జనరల్ సెక్రటరీ డి.అనురాధ, ప్రశాంత్ అన్ని కేజీబీవీ మండల కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు ఉన్నారు.

## గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని శిక్షణ కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన దర్బార్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీలను అందజేశారు. గుడిహత్నూర్ మండలం సోయంగూడ గ్రామానికి చెందిన వెడ్మ చంపత్ రావు గిరిరాజ కోళ్ల పెంపకానికి రుణం మంజూరు చేయాలని కోరారు. జైనూర్ మండలం కొలాంగూడకు చెందిన ఆత్రం భీమ్‌రావు, సిడాం భీమ్‌రావు, ఆత్రం మారు, సిడాం పారుబాయి, ఆత్రం మాణిక్ రావు, ఆత్రం లచ్చు సాగుకు తమకు ఎద్దుల జతలను, ఎడ్ల బండ్లను మంజూరు చేయాలని కోరారు. తలమడుగు మండలం పల్సి గ్రామానికి చెందిన సోయం సూర్యభాన్, మడావి జ్యోతిరామ్ తమకు సీఎం గిరివికాసం పథకం కింద బోరుబావి, విద్యుత్ మోటార్లు మంజూరు చేయాలని అన్నారు. రైతుబంధు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటు అర్జీలను అందజేశారు. ఆయా అర్జీలను పరిశీలించిన శిక్షణ కలెక్టర్ శాఖల వారీగా కేటాయించారు. సంబంధిత అధికారులు సమస్యలపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి, పరిష్కారానికి కృషి చేయాలనీ సూచించారు. ఈ దర్బార్‌లో ఏపీఓ జనరల్ భీమ్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ డా.దిలీప్ కుమార్, ఓఎస్డీ కృష్ణయ్య, ఏపీఓ పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఎఓ రాంబాబు, జెడీఎం నాగ భూషణ్, హెచ్ఓ సుధీర్, డీపీఓ ప్రవీణ్, అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలి

నవతెలంగాణ-బోథ్



నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జర్నలిస్టులందరికీ ఉచిత హామీలు ఇచ్చిన కేసీఆర్ ఎనిమిది సంవత్సరాలలో జర్నలిస్టులందరికీ ఎటువంటి సంక్షేమ పథకాలు అందించడం లేదన్నారు. అలాగే వైద్యవిద్య ప్రయాణ రంగంలో జర్నలిస్టులకు మినహాయింపు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 22న బోథ్ మండల కేంద్రానికి ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు వస్తున్న నేపథ్యంలో జర్నలిస్టులకు ఖచ్చితమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే నెల రోజుల్లోపు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోతే ఖమ్మం తరహా జర్నలిస్టులతో కలిసి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, మండల అధికార ప్రతినిధి ఎండీ అబ్రహం, నాయకులు షేక్ నాజార్ అహ్మద్, రాజశేఖర్ పాల్గొన్నారు.